తుపాను ముప్పు

కలెక్టరేట్.. ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాకు తుపాను ముప్పు ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం వాయుగుండం, తుపానుగా మారి రానున్న మూడ్రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకట మురళి అప్రమత్తం చేశారు. బాపట్లలో కలెక్టరేట్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. సంద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. సముద్రంలోకి ఎవరినీ వెళ్లనివ్వరాదని ఆదేశించారు. తుపాను ముప్పు తొలగే వరకు తాత్కాలికంగా పర్యాటకుల రాకను నిలిపి వేస్తూ బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన గంజాం, నిజాంపట్నం మండలాల్లో బీచ్‌లను మూసివేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను చీరాల, బాపట్లలో సిద్ధంగా ఉంచుతున్నారు.

❖ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు ముంపు బారినపడుతున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగింది. రైతులు మళ్లీ నాట్లు వేశారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో 2.25 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు మరోసారి తుపాను ముప్పు ఏర్పడింది. బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో మురుగు కాలువలు, వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. మరోసారి పంట నష్టం సంభవిస్తే కోలుకోలేమని రైతులు వాపోతున్నారు. గత 24 గంటల్లో జిల్లాలో బాపట్ల పట్టణంలో అత్యధికంగా 29.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 246.2 మి.మీ. వర్షం కురిసింది. సగటున 9.84 మి.మీ. నమోదైంది.



ఉద్ధృతంగా వెస్ట్‌స్వాంప్ మురుగు కాలువ

19 వరకు యంత్రాంగం సెలవులు రద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో జిల్లాకు ఎదురయ్యే విపత్తును ఎదుర్కోవటానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 18 వరకు భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్లో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 19 వరకు అధికారులు, ఉద్యోగులు ఎవరూ సెలవులో వెళ్లరాదన్నారు. ఇప్పటికే సెలవుల్లో ఉంటే రద్దు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు సాగరమిత్రల ద్వారా తక్షణమే సమాచారం ఇచ్చి వెనక్కి రప్పించాలని మత్స్యశాఖ జేడీ సురేష్‌ను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించటానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో పునరావాస కేంద్రాలు ఎంపిక చేసుకోవాలన్నారు. బలహీనంగా ఉన్న కాలువలు, చెరువులు, వాగుల కట్టలను జలవనరుల శాఖాధికారులు గుర్తించి గండ్లు పడకుండా మరమ్మతులు చేపట్టడానికి అంచనా వ్యయంతో నివేదిక ఇవ్వాలన్నారు. నిత్యావసరాలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు, కరెంటు స్తంభాలు కూలితే తక్షణమే తొలగించి పునరుద్ధరించటానికి యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పొక్లెయిన్లు, జనరేటర్లు ముందుగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వైద్యశిబిరాల ఏర్పాటు ద్వారా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

ఊపిరి పోసిన వర్షమే.. ఉసురు తీసింది!

కొల్లూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల్లో సాగవుతున్న మినుము, కూరగాయ పంటలు చేతికొస్తాయనే రైతుల నమ్మకం భారీ వర్షాలకు నీరుగారిపోతోంది. మినుము విత్తుకున్న కొన్ని పొలాలు వర్షం నీటిలో ముంపునకు గురి కాగా మిగిలిన పొలాలు ఉరక వల్ల దెబ్బతిన్నాయి. దీంతో ఖరీఫ్ పంట వరద పాలు కాగా రబీ పంట వర్షార్పణమవుతోందని అన్నదాతలు వాపోతున్నారు. కృష్ణానదికి వరదలు తగ్గిన అనంతరం విత్తుకున్న మినుముకు లేత దశలో అవసరమైన వర్షం జాడ కనిపించక పోగా వేసవిని తలపించే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఈ పంట ఎదుగుదల నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల తరువాత అడపాదడపా కురిసిన ఓ మాదిరి వర్షాలు ఈ పంటకు ఊపిరి పోశాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వీరి ఆనందం ఆవిరైంది. తుపాను కారణంగా నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో మరింత నిరాశ వ్యక్తమవుతోంది. భట్టిప్రోలు మండలంలో వరిపైర్లు నీటమునిగాయి.



భట్టిప్రోలు: నీట మునిగిన అద్దేపల్లి బాడవ పొలాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి



రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తుపాను విపత్తును సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని **మంత్రి అనగాని సత్యప్రసాద్** ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన దృష్ట్యా 4 నుంచి 5 రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసిందన్నారు. అతిభారీ వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలు అధికారుల సూచనలు పాటించి తక్షణం సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షాలు తగ్గేవరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని కోరారు. వానలకు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, పశు, గొర్రెల కాపరులు చెట్లు, విద్యుత్తు స్తంభాలు, టవర్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విపత్తు తొలగే వరకు పోలీసు, రెవెన్యూ, విద్యుత్తుశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

లక్ రాజాలకే కిక్కు

117 మద్యం దుకాణాలకు లాటరీ తీసిన కలెక్టర్.. జేసీ

ఈనాడు-అమరావతి, బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో 117 మద్యం దుకాణాలకు దరఖాస్తుదారుల ఎంపిక ప్రక్రియ సోమవారం విజయవంతంగా ముగిసింది. బాపట్ల పట్టణం రైలుపేటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రెండు కౌంటర్లలో కలెక్టర్, జేసీ లాటరీ విధానంలో వీరిని ఎంపిక చేశారు. ఆరుగురు మహిళలు ఏడింటిని కైవసం చేసుకున్నారు. సిండికేట్‌గా ఏర్పడిన అర్జీదారుల్లో కొందరికి అదృష్టం కలిసిరాగా, మరికొందర్ని దురదృష్టం వెన్నాడి ఒక్కటీ రాలేదు. దుకాణాలు దక్కించుకున్నవారు సంబరాలు చేసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు.

జిల్లాలో ఆరుగురు మహిళలకు ఏడు షాపులు



మద్యం దుకాణానికి లాటరీలో వచ్చిన టోకెన్ నంబరు చూపుతున్న కలెక్టర్ వెంకట మురళి

ఒకటో కౌంటర్‌లో బాపట్ల, చీరాల, వేమూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలకు కలెక్టర్ వెంకట మురళి, రెండో కౌంటర్‌లో పర్చూరు, అద్దంకి, రేపల్లె, నగరం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని దుకాణాలకు జేసీ ప్రఖర్ జైన్ లాటరీ తీశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి దరఖాస్తుదారులను మాత్రమే లోపలికి అనుమతించారు. బాపట్ల పట్టణంలో ఒకటో మద్యం దుకాణంతో లాటరీ తీసే ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. దరఖాస్తుదారులు వందకు పైగా కార్లలో తరలిరావటంతో కల్యాణ మండపం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ మండపం నిర్వాహకుడు తండ్రికి బాపట్ల మండలంలో దుకాణం రావటం విశేషం. ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.దేవదత్తు, ఏఈఎస్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో గ్లోరియా కార్యక్రమ ప్రక్రియను, డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు హరికృష్ణ, అహ్మద్‌జానీ, గంగాధర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

వెంటనే ఫీజులు కట్టేలా..

డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసుల సారథ్యంలో ఎక్సైజు యంత్రాంగం లాటరీ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, లాటరీలో ఎంపికైన లైసెన్సీలతో వెంటనే ఫీజులు కట్టించేలా బ్యాంకర్లను అందుబాటులో ఉంచింది. దుకాణాలు దక్కించుకున్న వారు సోమవారం రాత్రికల్లా నిర్దేశిత లైసెన్సు ఫీజులో ఆరో వంతు చెల్లించటంతో వారి పేరుతో మంగళవారం ఉదయానికల్లా లైసెన్సులు మంజూరుచేసేలా చర్యలు వేగవంతం చేశారు. బుధవారం ఉదయానికి కల్లా ఆ షాపులకు మద్యం నిల్వలు సరఫరా చేయాలని డిపో అధికారులను పిలిచి, సోమవారం రాత్రి డీసీ శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.

❖ కర్లపాలెం మండలంలో 33వ నంబరు దుకాణం ఓ మహిళకు వచ్చింది. ❖ ఓ సిండికేట్‌కు చెందిన వారు 30 దరఖాస్తులు వేసి నాన్‌రిఫండబుల్ రుసుం కింద రూ.60 లక్షలు చెల్లించారు. కానీ ఒక్కటీ రాకపోవటంతో నిరాశకు గురయ్యారు. మరో సిండికేట్ తరపున 19 దరఖాస్తులు సమర్పించి రూ.38 లక్షలు చెల్లించినా తగల్లేదు. ❖ బాపట్లకు చెందిన ఓ సిండికేట్ కూటమి 50 అర్జీలు వేయగా ఐదు దక్కాయి.



వేలంపాట నిర్వహిస్తున్న కల్యాణ మండపం బయట సందడి

నేటితో ముగియనున్న పాత పాలసీ

రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో తెరపడనుంది. మంగళవారం నాటికి విక్రయం కాగా మిగిలిన స్టాకు మొత్తాన్ని డిపోలకు అందజేయాలని ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి.

❖ నగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నిజాంపట్నం మండలంలో ఓ మహిళ రెండు దుకాణాలు కైవసం చేసుకోగా, చెరుకుపల్లి మండలంలో మరో వ్యక్తి 52, 53 దుకాణాలు దక్కించుకున్నారు. ❖ చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తికి చీరాల పట్టణంలో ఒకటి, వేటపాలెంలో ఒకటి వచ్చాయి. ❖ సంతమాగులూరు మండలంలో సీఏ ఫైనల్ చదువుతున్న విద్యార్థిని ఒకటే దరఖాస్తు చేయగా దక్కించుకున్నారు. ❖ చీరాలలో మొదటి దుకాణాన్ని ఓ మహిళ కైవసం చేసుకున్నారు. ❖ బాపట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 19 మద్యం దుకాణాలకు లాటరీ తీయగా ఒకే సిండికేట్‌లో బంధువర్గానికి చెందిన ముగ్గురికి ఐదు దక్కాయి.

❖ చీరాలకు చెందిన ఓ కౌన్సిలర్‌కు రెండు రాగా, రేపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 37, 38 దుకాణాలు ఒకే వ్యక్తికి దక్కాయి.

❖ అద్దంకి ఎక్సైజ్ స్టేషన్ పరిధి కొరిశపాడు మండలంలో దరఖాస్తుదారుడు రెండు కైవసం చేసుకున్నారు.

➻ జిల్లాలో 117 షాపులకు 2148 దరఖాస్తులు రాగా వీటి ద్వారా రూ.42.96 కోట్ల ఆదాయం వచ్చింది.

➻ ఏడాదికి లైసెన్సుల రూపేణా వచ్చిన ఆదాయం రూ. 72.45 కోట్లు

చెరువు కాదిది.. జాతీయ రహదారి!

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. మండల కేంద్రం చెరుకుపల్లి ఐలాండ్ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహం చుట్టూ అభివృద్ధి పనులు నిలిచాయి. విగ్రహం తొలగింపులో ప్రతిష్ఠంభన నెలకొనడంతో గత అయిదేళ్లుగా ఇక్కడ పనులు సాగలేదు. దీంతో గుంతలు ఏర్పడి నీరు నిలుస్తోంది. చిన్న గుంతలు కాస్తా నేడు భారీ గుంతలుగా మారి ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై అడుగున్నర మేర గుంత ఏర్పడి అందులో నీరు నిలిచి అంబేడ్కర్ విగ్రహం ముందు ఇలా చెరువులా మారింది. అధికారులు గుంతలను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే



17 నుంచి జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బీఆర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ హాలులో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. 250 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. వివరాలకు 93936 52577, 81431 43222 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైతేరాజు
ప్రకృతి ఒడిలో.. పంటల సాగు
వరి పొలాల్లో ఎలుకల బెడద 6లో

రాష్ట్రంలో రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు: మంత్రి

ఏల్చూరు (సంతమాగులూరు), అద్దంకి, న్యూస్‌టుడే: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో రూ.4,500 కోట్ల నిధులతో 30 వేల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఉద్ఘాటించారు. ఏల్చూరులో సోమవారం జరిగిన 'పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో' ఆయన పాల్గొన్నారు. స్థానికంగా రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న అంతర్గత సిమెంటు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అద్దంకిలో రూ.19 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్యం మెరుగు పరచడం, రహదారులు, పక్కా మురుగు కాలువల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో అఖిల, డ్వామా పీడీ విజయలక్ష్మీ, తహసీల్దారు రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణ శంకుస్థాపనలో మంత్రి రవికుమార్

మిర్చి క్రయవిక్రయాలపై వర్షం ప్రభావం

గుంటూరు, న్యూస్‌టుడే: మిర్చి క్రయవిక్రయాలపై వర్షం ప్రభావం చూపింది. విజయదశమి సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు యార్డుకు సెలవులు వచ్చినప్పటికీ సోమవారం తక్కువ సంఖ్యలో బస్తాలు వచ్చాయి. ఉదయం నుంచే చిరుజల్లులు పడుతుండడంతో సరకు తడుస్తుందని రైతులు శీతల గిడ్డంగుల్లో నుంచి వెలుపలకు తీసేందుకు ఆసక్తి కనబర్చలేదు. 24,413 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 21,793 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 20,808 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,600, తాలు మిర్చికి రూ.5,000-11,500, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.10,000-18,600, తాలు మిర్చికి రూ.5,000-11,000 ధర లభించింది.

టీవీ, సినిమా అధ్యయన కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంఏ టీవీ, సినిమా అధ్యయన కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమన్వయకర్త డాక్టర్ మధుబాబు ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా రంగంపై ఆసక్తి ఉన్న అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డాక్యుమెంటరీ, ఆర్ట్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్, క్రియేటివ్ లైటింగ్, ఎడిటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డు, సినిమాటోగ్రఫీ, ఫిలింగ్రామర్ సబ్జెక్టులను బోధిస్తామని తెలిపారు. యూజీసీ ఆదేశాల మేరకు బోధనతో పాటు 50 శాతం ప్రాక్టికల్ మార్కులుంటాయని చెప్పారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జ్వాలాముఖి.. జలవిహారం





శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న చీరాల వైకుంఠపురంలోని జ్వాలాముఖి అమ్మవారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారుచేసిన హంస వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. – చీరాల, న్యూస్‌టుడే

ఇసుకకు.. ఎదురుచూపులు తప్పవా?

- ✶ కృష్ణా నదిలో భారీగా నీటి ప్రవాహం
- ✶ ఈ నెల 16 నుంచి రేవుల్లో తవ్వకాలు కష్టమే

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో కృష్ణా నదిలో కొల్లూరు మండల పరిధిలో గాజుల్లంక, జువ్వలపాలెం రేవుల్లో ఇసుక తవ్వకాలు ఈ నెల 16 నుంచి ప్రారంభించటం కష్టసాధ్యంగానే ఉంది. నదిలో ప్రస్తుతం భారీగా నీటి ప్రవాహం ఉంది. ప్రభుత్వ, పర్యావరణ అనుమతులు వచ్చినా పరిస్థితులు అనుకూలించని కారణంగా తవ్వకాల్లో జాప్యం తప్పేలా లేదు. ఈ లోగా కనీసం పట్టా భూముల నుంచైనా ఇసుకను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణదారులు ఇసుక కోసం మరి కొన్ని రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

నెమ్మదించిన నిర్మాణాలు: జిల్లాలో కృష్ణా, గుండ్లకమ్మ నదుల నుంచి తవ్విన 73 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ఆరు స్టాక్ పాయింట్ల ద్వారా ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం గత జులై మొదటి వారంలో విక్రయాలు ప్రారంభించింది. ఆగస్టు మొదటి వారానికే స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోయింది. ఆ తర్వాత భారీ వర్షాలు కురిసి కృష్ణా నదికి వరదలు వచ్చాయి. గతంలో కొల్లూరు మండలం గాజుల్లంక, జువ్వలపాలెం రేవుల్లో తవ్వకాలు చేసేవారు. భారీ వరదకు నదిలో ఏర్పాటు చేసిన రీచ్‌లు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఇసుక అందుబాటులో లేదు. ఇసుకకు బాగా డిమాండ్ ఏర్పడింది. నల్లబజారులో అధిక ధర వెచ్చించి నిర్మాణదారులు ఇసుక కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.6 వేలు, 20 మెట్రిక్ టన్నుల లారీ ఇసుక రూ.40 వేల ధర పలుకుతోంది. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు నెమ్మదించాయి. పనులు తగ్గిపోయి భవన నిర్మాణ కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది.



ఉద్ధృతంగా ప్రవాహం

కొరత అధిగమించే ప్రణాళిక

ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. జిల్లాలో తవ్వకాలకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలించి తుది అనుమతులు జారీ చేయనున్నది. ఇప్పటి వరకు ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది. మరో రెండు దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నారు. ఒక వేళ నదిలో ఇసుక తవ్వకాలకు జాప్యం జరిగితే పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతించటం ద్వారా ఇసుక కొరతను అధిగమించాలని జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది.

తరలింపు అసాధ్యం

గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో ఈనెల 16 నుంచి ఇసుక తవ్వకాలు ప్రారంభించటానికి గనుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారు. యంత్రాల ద్వారా కాకుండా కూలీల ద్వారా తవ్వకాలు చేపట్టనున్నారు. దీని కోసం నదిలో రెండు ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేశారు. అయితే ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం ఉండటం వల్ల రీచ్‌లలోకి వాహనాలు వెళ్లే అవకాశం లేదు. ఇసుక తవ్వి బయటకు తరలించటం సాధ్యమయ్యేలా లేదు. రీచ్‌లోకి వాహనాల రాకపోకల కోసం కొత్తగా మార్గాన్ని వేయాల్సి ఉంటుంది. నీరుంటే మార్గం వేయటం సాధ్యపడదు. నీరు తగ్గితే తప్ప తవ్వకాలు సాధ్యం కాదు.

మరో రెండు చోట్ల సన్నాహాలు!: కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్, గనుల శాఖ ఏడీ రాజేష్‌తో కూడిన జిల్లా ఇసుక కమిటీ బృందం కొల్లూరు మండలంలో పర్యటించి ఇసుక తవ్వకాలు చేపట్టాల్సిన గాజుల్లంక, జువ్వలపాలెం రేవులను ఇటీవల పరిశీలించింది. నదిలో నీటి ప్రవాహ ఉద్ధృతిని ప్రత్యక్షంగా చూశారు. ఈ నెల 5న నదిలో నీటి ప్రవాహం 45 వేల క్యూసెక్కులు ఉండగా ప్రస్తుతం కొంత తగ్గింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం, తుపానుగా మారి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కృష్ణా నదిలో ఎన్ని రోజులు నీటి ప్రవాహం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురవకుండా ఉంటే వారం రోజుల్లో నదిలో ప్రవాహం తగ్గుతుందని భావిస్తున్నారు. వర్షాలు కురిస్తే ప్రవాహం కొనసాగుతుంది. నీరు ఉంటే రీచ్‌లలోకి వెళ్లటానికి మార్గం నిర్మించలేరు. ప్రవాహం పెరిగితే కనీసం రెండు వారాలు అంటే నీరు తగ్గే వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ నెల 16 నుంచి కూలీల ద్వారా ఇసుక తవ్వటానికి గనుల శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అనుకూలించటం లేదు. వానలు కురవకుంటే ఈనెల 23 తర్వాతైనా నదిలో తవ్వకాలు చేపట్టాలని భావిస్తున్నారు. భారీ వర్షాలు పడితే మాత్రం నవంబరు 1 వరకు రేవుల్లో ఇసుక తవ్వకాల కోసం ఎదురుచూడక తప్పదు. ప్రస్తుతం ఉన్న రెండు రేవులు కాకుండా కొత్తగా కొల్లూరు మండలంలో గాజుల్లంక-2, భట్టిప్రోలు మండలంలో ఓలేరు రేవుల్లోను భవిష్యత్తులో తవ్వకాలు ప్రారంభించటానికి గనుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



ఈనెల 6న గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్

నీరు తగ్గాక తవ్వకాలు

ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉండటం వల్ల రేవుల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాలకు మార్గం వేయటం కష్టసాధ్యమవుతుంది. నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాతే తవ్వకాలు చేపట్టగలం. పట్టా భూముల్లో తవ్వకాలకు వచ్చిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి నిబంధనల ప్రకారం ఉన్న ప్రాంతంలోనే అనుమతి ఇస్తాం. **– రాజేష్, ఏడీ, గనుల శాఖ**



చెరుకుపల్లి: గూడవల్లి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న ఆర్ఎం డ్రెయిన్



కొల్లూరు: కిష్కింధపాలెం వద్ద వాన నీటిలో మునిగిన మినుము పంట

అమ్మో.. అల్పపీడనం

బెంబేలెత్తుతున్న రైతులు ★ మళ్లీ ముంపు భయం



చెరుకుపల్లి: గుర్రపుడెక్కతో కావూరు డ్రెయిన్

చెరుకుపల్లి, కనగాల, గుళ్లపల్లి, గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), వేమూరు, కొల్లూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాల్వలు నిండుకుండలను తలపిస్తున్నాయి. చెరుకుపల్లి మండలంలో గూడవల్లి వద్ద ఆర్ఎం డ్రెయిన్ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పుడే ఇలా ప్రమాదకరంగా మారితే భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నెలాఖరులో కురిసిన వర్షాలతో సంభవించిన వరదకు డ్రెయిన్ పరిధిలో దాదాపు 7వేల ఎకరాలకు పైగా వరిపైర్లు తుడిచిపెట్టుకుపోయాయి. సుమారు నాలుగు మండలాల పరిధిలో 12 గ్రామాలకు చెందిన 5వేల మంది రైతులు నష్టపోయారు. ఇప్పటికే ముంపునకు గురైన పొలాల్లో గట్లు నాని పొలాల్లో కలిసిపోయాయి. మళ్లీ ముంపు వస్తే అంతంత మాత్రంగా ఉన్న పొలాలు, కాల్వలు పూర్తిగా రూపు కోల్పోతాయి. తద్వారా వేసవిలో వీటిని పూర్తిగా ఆధునికీకరణ చేయాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. గతంలో మునిగిన పొలాలు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి. మళ్లీ ఇవి నీటితో మునిగితే ఎదిగేందుకు వేసవి వరకు ఆగాల్సి ఉంటుంది. అదే జరిగితే రబీ పంట వేసుకునే అవకాశం లేక ఒక వ్యవసాయ సీజన్ కోల్పోయినట్లు అవుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు 27.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. వరి నాటి మూడు నెలలు కాలేదు. పైరు మూడుసార్లు ముంపునకు గురైతే ఇంకేం వ్యవసాయం చేస్తాం, ఎంతని పెట్టుబడి పెడతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదేళ్లుగా సరైన నిర్వహణ లేక డ్రెయిన్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటి సమయంలో ముంపునకు గురైనప్పటికీ అధికారులు స్పందించి వరదల్లో మురుగు కాలువలను బాగుచేయిస్తే కొంతైనా తమకు సమస్య తగ్గుతుందని రైతులు అంటున్నారు. వేమూరు, చుండూరు మండలాల్లో జంపని, వేమూరు, పెరవలి, కోడిపర్రు, పెనుమర్రు, చుండూరు, పెదగాదెలవర్రు, మోదుకూరు తదితర గ్రామాలలో పల్లంగా ఉన్న పొలాల్లోని వరి పైరు నీటమునిగే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుకు వినతి



అక్రమ రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదు చేస్తున్న భాజపా నేత శ్రీనివాస్

బాపట్ల, న్యూస్‌టుడే: తప్పుడు పత్రాలతో పట్టణంలో భీమావారిపాలెంలోని ఇంటిని విజయవాడ సమీపంలోని కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వెంకట మురళికి భాజపా నేత శ్రీనివాస్ సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి డీఆర్వో సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారితో కలిసి కలెక్టర్ సోమవారం అర్జీలు స్వీకరించారు. మండల పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఏళ్ల తరబడి పడమర బాపట్ల పంచాయతీకి ఆస్తి పన్ను చెల్లించటం లేదని కలెక్టర్‌కు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలని కోరారు.

శ్మశానవాటికలకు భూములు గుర్తించాలి.. శ్మశానవాటికలు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు భూములు గుర్తించాలని తహసీల్దార్లను కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు చొరవ చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. నేటికీ ఆధార్‌కార్డులు లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు.

పల్లె పండగ జయప్రదం చేయాలి

బాపట్ల, న్యూస్‌టుడే: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. వారోత్సవాల నిర్వహణపై జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయం నుంచి సెల్ కాన్ఫరెన్సు సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో రూ.88 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పల్లెల్లో చేపట్టనున్న ప్రగతి పనులపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 454 గ్రామ పంచాయతీల్లో శ్మశానవాటికలు, మురుగుకాలువలు, సీసీ రోడ్లు, వసతిగృహాలు, పాఠశాలల ప్రహరీలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టే పనులపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రాలతో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ, డీపీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా శ్రేణులపై దాడులు అరికట్టండి



ఎస్పీ కార్యాలయం వద్ద వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: జిల్లాలో వైకాపా శ్రేణులపై దాడులను అరికట్టాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ తుషార్‌డూడీని ఆ పార్టీ జిలా అధ్యక్షుడు మేరుగ నాగార్జున కలిసి కోరారు. ఎస్పీ కార్యాలయం వద్ద బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లె, వేమూరు సమన్వయకర్తలు ఈవూరి గణేష్, వరికూటి అశోక్‌బాబుతో కలిసి ఆయన సోమవారం మాట్లాడారు. వైకాపా నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 21న బాపట్లలో వైకాపా జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తానన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



మహిళ ఇచ్చిన అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను చట్టపరిధిలో వేగంగా విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 29 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఎస్పీ ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. డీఎస్పీ రామాంజనేయులు, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో.. పంటల సాగు



కూరగాయల సాగు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట కూరగాయల మార్కెట్‌లో టోకు వ్యాపారం చేసే గుడిపల్లి నాగభూషణం రసాయనాలు కాకుండా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు, పండ్లు, నూనెలు ప్రజలకు అందించాలని సంకల్పించారు. చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్ల వద్ద ఆరు ఎకరాల సాగు భూమిని కౌలుకు తీసుకుని మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.



జీవ ఎరువుల తయారీని సిబ్బందికి వివరిస్తున్న నాగభూషణం

పండిస్తున్న పంటలివే.. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా ఆవుపేడ, గోమూత్రం, నల్లబెల్లం, ఉలవపిండి, శనగలు తదితరాలతో తయారు చేసిన ద్రవ జీవామృతం మిశ్రమాన్ని ఎరువుగా ఉపయోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. వంకాయ, బెండ, సొర, పొట్ల, కాకర, దొండ, బీర, మునగ, పసుపు, గుమ్మడి, బూడిద గుమ్మడి, బొప్పాయి, అరటి, జామ, సీతాఫలాలు, తోటకూర, పాలకూర, మెంతుకూర, బచ్చలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, పశుగ్రాసాలు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఒంగోలు జాతి, గిరి జాతి, షాహివాల, కపిల, నాటు ఆవులు, ఎద్దులు పెంచుతున్నారు. నాటుకోళ్లు, గిరిరాజా కోళ్లు, గిన్నె కోళ్లు, కడక్‌నాథ్ కోళ్లు, హంసలు, బాతులను సంరక్షిస్తున్నారు.

ప్రకృతికి మించిన దైవం లేదు

ప్రకృతి అమ్మ ఒడి లాంటిది. దానిని మరిచిపోతే మనల్ని క్షమించదు. అందుకే ప్రకృతికి మించిన దైవం లేదు. ఈ సాగు చేయడం కష్టసాధ్యమైనా ఇక్కడకు ప్రతిరోజు వచ్చి ప్రకృతి ఒడిలో సేద తీరడం, పనులు చేయడం మనసుకు ఆనందాన్ని ఇస్తుంది. దీంతో పాటు లాభాపేక్ష లేకుండా ఆరోగ్య రక్షణకు జీవ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండిస్తున్నా.

– గుడిపల్లి నాగభూషణం, ప్రకృతి వ్యవసాయదారుడు, చిలకలూరిపేట

రైతేరాజు

వరి పొలాల్లో ఎలుకల బెడద

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే : ఖరీఫ్ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు పడటంతో పొలాల్లో తుంగ, ఊద, గరిక వంటి ఇతర కలుపు జాతి మొక్కలు బాగా పెరిగాయి. ఎలుకలు వాటి కాండాలు తొలిచి ఆహారంగా తీసుకుంటాయి. ఎలుకల నివారణకు అనుకూలమైన వాతావరణం లేక సంతతి ఎక్కువగా ఉందని వేటగాళ్లు చెబుతున్నారు. వీటి నివారణకే రూ.2 వేల నుంచి రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మాగాణి పొలం పక్కనే మెట్ట పొలాలు, సాగు చేయకుండా వదిలిన బీడు భూములు ఉంటే ఆ పొలంలో ఎలుకల నివారణకు ఖర్చులు రూ.వేలల్లో అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎలుకల దాడితో పంట దిగుబడులు తగ్గుతాయనే భయంతో ఎంత ఖర్చు అయినా ఎలుకలను పట్టించక తప్పడం లేదని మాగాణి రైతులు తెలుపుతున్నారు.



ఎలుకల బొరియలు పెడుతున్న వేటగాడు

నివారణ ఇలా.. : పొలాల్లో ఎలుకలను తేలిక పద్ధతుల్లో నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి అన్నారు. తొలిరోజు బొరియలను గుర్తించి మూసివేయాలి. రెండోరోజు 96 గ్రాముల నూకలను 2 గ్రాముల వంటనూనెను కలిపి 10-15 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి బొరియల వద్ద ఉంచాలి. ఒక రోజు ఆగి మళ్లీ 2 గ్రాముల జింక్ ఫాస్పేట్‌ను కలిపి నూకలు, నూనె మిశ్రమాన్ని తయారు చేసి ఆ పొట్లాలను బొరియల వద్ద ఉంచాలి. అవి తిన్న ఎలుకలు చనిపోతాయి. తర్వాత రోజు మళ్లీ బొరియల్లో ఎండుగడ్డి అంటించి పొగ పెట్టాలి. పది రోజులకు ఓసారి గ్రామోడయోలాన్ మందును వాడి పంట కాలువల్లో ఉండే ఎలుకలను అరికట్టవచ్చు.

జీవాల్లో మూతిపుండ్ల వ్యాధి.. నివారణ ఇలా..!





మౌనిక, పశువైద్యాధికారి

అమృతలూరు, న్యూస్‌టుడే : మూతిపుండ్ల వ్యాధి జీవాల్లో అతి వేగంగా వ్యాపించే వైరస్. దీన్ని గజ్జిమూతి వ్యాధి, కంటాజియోస్ ఎక్తిమా అని వ్యవహరిస్తారు. గొర్రెల్లో కన్నా మేకల్లో అధికంగా కనిపిస్తోంది. ఈ వ్యాధి నివారణ, జాగ్రత్తలు అమృతలూరు పశు వైద్యాధికారిణి మౌనిక వివరించారు.

వ్యాప్తి: ఇది నేరుగా.. లేక నోటి దగ్గర పగిలిన చర్మ గాయాల ద్వారా లోనికి ప్రవేశిస్తుంది. వైరస్‌తో కలుషితమైన మేత లేదా నీటి తొట్టెల ద్వారా వ్యాపించవచ్చు. వచ్చాక 80 శాతం వరకు మందలో వ్యాప్తికి అవకాశం ఉంది.

లక్షణాలు : వైరస్ ఆశించిన మూడు నాలుగు రోజుల తర్వాత పెదవులు, మూతి చుట్టూ బుడిపెలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి చీము పట్టి పగిలి గాయాల మాదిరిగా మారతాయి. ఆ ప్రాంతంలో గాయం నుంచి రక్తం కారుతుంది. రెండు నుంచి నాలుగు వారాలకు గాయాలు మాని గట్టిగా బొబ్బలా మారి రాలిపోతాయి. వీటిని చేతితో లాగరాదు.

చికిత్స : లక్షణాలు కనిపించగానే జీవాన్ని మంద నుంచి వేరు చేయాలి. తొలిరోజు నుంచి చికిత్స చేయాలి. అశ్రద్ధ వహిస్తే చిన్న పిల్లల్లో మరణాలు సంభవిస్తాయి. గాయాలను ముందుగా పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి యాంటీబయోటిక్ లేపనం పూయాలి. పశు వైద్యులతో చికిత్స అందించాలి.

నివారణ చర్యలు : ఈ వ్యాధికి వ్యాక్సిన్ మన దేశంలో అందుబాటులో లేదు. తల్లి నుంచి పిల్లలకు, పిల్లల నుంచి పాలు తాగే సమయంలో తల్లికి సోకుతుంది. కనుక పాలు కాచి చల్లార్చి సీసాతో తాగించాలి. రాలిపోయిన బొబ్బలు గమనించి షెడ్డుకు దూరంగా కాల్చి పారవేయాలి.

జున్ను పాలు.. దూడలకు మేలు

లేగ దూడల పోషణ పరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా తయారవుతాయని ప్రత్తిపాడు పశువైద్యశాల సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలి. దూడల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు జున్నుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే జున్నుపాలు తాగించాలి. తాగలేని దూడలను తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాగించాలి. జున్నుపాలలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయని శ్రీనివాసరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు**

మాచవరం వద్ద కుంగిన రైల్వే ట్రాక్

చెన్నై- విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం

పొన్నూరు, బాపట్ల, గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: చెన్నై నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రైల్వే ట్రాక్ ఒక వైపు కుంగింది. రెండు రోజులు నుంచి వర్షాలు కురవడంతో అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే రైళ్లను అతి తక్కువ వేగంతో నడుపుతున్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతుల ప్రక్రియను చేపట్టగా.. ఈ పనులకు వర్షం అడ్డంకిగా మారింది. మాచవరంలో సిగ్నల్ వ్యవస్థ పనిచేయక పోవడంతో సోమవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అక్కడ నిలిచిపోయింది. రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వందే భారత్ రైలును అప్పికట్లకు వెనుకకు పంపించారు. అప్పికట్ల నుంచి నిడుబ్రోలు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై వందేభారత్ రైలును పంపారు. అదే ట్రాక్‌లో మిగిలిన రైళ్లను పంపిస్తున్నారు. ఆ మార్గంలో రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.



పి.వి.పాలెం: చందోలు - సంగుపాలెం మార్గం



అమృతలూరు: గోవాడలో రహదారి దుస్థితి



చుండూరు: చుండూరు-మోదుకూరు రోడ్డు ఇలా..

గుంతల దారి.. కష్టాలే మరి

చందోలు (పిట్టలవానిపాలెం), చుండూరు, అమృతలూరు, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో రహదారుల అభివృద్ధిపై వహించిన అలసత్వం.. ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. రహదారులు అభివృద్ధి చేయక పోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత పాడవుతున్నాయి. పిట్టలవానిపాలెం మండలంలో చందోలు నుంచి సంగుపాలెం వెళ్లే ప్రధాన రహదారి గోతులతో నిండి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక కుదుపులతో రాకపోకలు సాగిస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి బాపట్ల జిల్లా చెరుకుపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిలో గుంటూరు జిల్లా పెదరావూరు నుంచి అమృతలూరు మండలం గోవాడ వరకు పెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాలకు చిన్న పాటి చెరువులను తలపిస్తున్నాయి. ప్రయాణికులు పడుతూ లేస్తూ గమ్యస్థానాలకు చేరాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారులు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మండల కేంద్రం చుండూరు నుంచి మోదుకూరు వెళ్లే రహదారి గురుకుల పాఠశాల అడ్డరోడ్డు నుంచి మోదుకూరులోని శ్రీ కనకదుర్గ ఆలయం వరకు గుంతలుగా మారింది. ఒక్కో చోట రెండడుగుల లోతున గుంతలు పడ్డాయి. నిత్యం ఈ మార్గంలో కళాశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనిపాటలపై చుండూరు, తెనాలి వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ సైమన్‌పాల్‌ను సంప్రదించగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని రహదారిని పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతానని సమాధానం ఇచ్చారు.



అమృతలూరు: కూచిపూడిలాకు-పెదరావూరు మధ్య..

విద్యాసంస్థలకు సెలవుపై నేడు నిర్ణయం

బాపట్ల: జిల్లా వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురవడంతో కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలలో విద్యాసంస్థలకు డీఈవో నారాయణరావు సోమవారం సెలవు ప్రకటించారు. మంగళవారం ఉదయం వాతావరణ పరిస్థితి ఆధారంగా విద్యాసంస్థల సెలవుపై కలెక్టర్ నిర్ణయం మేరకు ప్రకటిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

అయిదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసుల అదుపులో ఓ ట్రాక్టర్

వేమూరు, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు వేమూరు ఎస్సై రవికృష్ణ తెలిపారు. సేకరించిన వివరాల ప్రకారం యడ్ల బండ్లపై ఇసుక తరలింపును అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో కొందరు దాన్ని ఆసరాగా తీసుకుని నదిలోని ఇసుకను బండ్లపై కొల్లూరు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లలో నింపి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొల్లూరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గస్తీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. వాటిలో మూడు ట్రాక్టర్లు వేమూరు మార్కెట్ యార్డు సమీపంలో, రెండు జంపని చక్కెర కర్మాగారం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

బాపట్ల
•బాపట్ల •రేపల్లె •వేమూరు

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి


ఎంపీ కృష్ణప్రసాదుకు మొక్క ఇస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పట్టణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రగతి పనులు వేగంగా చేపట్టాలని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డికి ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి సోమవారం మొక్క అంద జేశారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. తాగునీటి సమస్య నివారణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

మురుగు కాల్వలు ఆక్రమిస్తే చర్యలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మున్సిపా లిటీ పరిధిలో మురుగు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు, వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ సాంబశివరావు హెచ్చరించారు. పట్టణంలో చాలా చోట్ల మురుగు కాల్వలు ఆక్రమణలకు గురవడంతో పూడికతీతకు ఆటంకం కలుగుతోందని, రద్దీ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఇప్పటికే మురుగు కాల్వలను ఆక్రమించిన వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. ఆక్రమ ణలు తొలగించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపుకు పురపాలిక అధికారుల సూచన పాటించి సహకరించాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? చందోలు 1వ వార్డులో ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలో వాడుక నీరు వచ్చి నిల్వటంతో పాటి పట్టి వాహనదారులు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి. - **స్థానికులు, చందోలు**
✔ పరిశీలించి నీటి నిల్వకుండా చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.- **సుజాత, పంచాయతీ కార్యదర్శి, చందోలు**
– న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

? చుండూరు మండలం యడ్లపల్లిలో పలు కచ్చా డ్రెయి న్లలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. దీంతో నీరు ముందుకు కదలడం లేదు.
- **స్థానికులు, యడ్లపల్లి**
✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పూడికతీత చర్యలు చేపడతాం. - **కుమారస్వామి, ఈవోపీఆర్డీ**
– న్యూస్‌టుడే, వేమూరు

? చందోలు సైదా వీధిలోని ప్రాథమిక పాఠశాల ఎదుట నీరు నిల్వడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచి దోమలకు నిలయంగా మారు తోంది. - **స్థానికులు, చందోలు, సైదా వీధి**
✔ పరిశీలించి సిబ్బందిని పంపి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. - **సుజాత, పంచాయతీ కార్యదర్శి, చందోలు**
– న్యూస్‌టుడే, చందోలు(పిట్టలవానిపాలెం)

? పట్టణంలో నరాలశెట్టివారిపాలెం రామాలయం వీధిలో వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు చీకట్లు అలుముకుని స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- **మల్లికార్జునరావు, విశ్రాంత ఉద్యోగి**
✔ ఇంజినీరింగ్ సిబ్బందిని పంపి వెంగని దీపాల స్థానంలో కొత్త వాటిని వేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసు కుంటా. - **రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్**
– న్యూస్‌టుడే, బాపట్ల

సమస్యల వలయంలో..
పాత రేపల్లె

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె పాత పట్టణం సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతోంది. 1962లో రేపల్లె మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు నిర్లక్ష్యానికి గురైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా పాలనలో పెద్ద పోస్టాఫీసు నుంచి అంకమ్మచెట్టు వరకు రహదారి విస్తరణ చేపట్టారు. పాత పట్టణం నుంచి చినరవపల్లి వెళ్లే మార్గంలో సుమారు 400 మీటర్ల వరకు రోడ్డు విస్తరింది అసంపూర్తిగా వదిలేశారు. రెండో వార్డు శివారులో 2018లో చేపట్టిన టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తికాక లబ్ధి దారులు నిరాశకు గురవుతున్నారు. రహదారికి ఓ పక్కన కచ్చా కాల్వలున్నా సక్రమంగా పారుదల లేక ఎక్కడి మురుగు అక్కడే తిష్టవే స్తోంది. రెండోవార్డు శివారు గునిపారిపా లెంలో మురుగు కాల్వ సదుపాయం లేదు. మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగు నీరందక శివారులో ప్రజలు సొంతంగా బోర్లు వేసుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. గృహావసరాలకు సైతం చేతి పంపులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

నేటికీ పలుచోట్ల కచ్చా కాల్వలే.. ముందుకు కదలని మురుగు


కోట శివారులో మురుగుకాల్వ దుస్థితి

ఏడాదిగా ట్యాంకరు నీరే..

పట్టణంలో ఒకటో వార్డు ఎస్సీ కాలనీవా సులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతు న్నారు. దీంతో గడిచిన ఏడాదిగా రెండ్రోజులు కొకసారి ట్యాంకరుతో మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఒకటో వార్డులో పలుచోట్ల మురుగు కాల్వల సదుపాయం లేదు. ప్రధాన రహదారి పక్కన నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.

❖ రెండో వార్డు రజక కాల నీలో కొన్నిచోట్ల సీసీ రోడ్డు నిర్మి ంచినా మురుగు కాల్వల సదుపా యానికి నోచుకోలేదు. రూ.1.50 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించిన రాజీగారి సత్రం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రాలేదు. ❖ రెండు నుంచి ఏడు వార్డుల్లో పలుచోట్ల మురుగు కాల్వలు పూడిపోయాయి. మురుగు సక్రమంగా పారక దోమలకు నిల యంగా మారాయి. దోమకాటుకు గురై తర చూ అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గునిపారిపాలెం వెళ్లే మార్గంలో ఉన్న మూడు చేతిపం పుల్లో రెండు నిరుప యోగంగా మారాయి. 2, 3, 4 వార్డుల ప్రజలు చాలామంది ఈ పంపులను ఆశ్రయి స్తుంటారు. ఒక్కటే పనిచేయడంతో ఇబ్బందులు పడుతు న్నారు.


మూడోవార్డులో పూడిన మురుగుకాల్వ


రెండోవార్డు శివారులో పనిచేయని చేతిపంపులు

ఆది నుంచి అభివృద్ధికి దూరం

గతంలో హోల్‌సేల్ వ్యాపారానికి పాతపట్టణం పెట్టింది పేరు. అంకమ్మచెట్టు నుంచి పెద్ద మసీదు వరకు ఇరుకు మార్గం కావడంతో వాహనరద్దీ సమస్య తలెత్తేది. ఈ క్రమంలో పెరుగుతున్న జనావాస అవ సరాలకు అనుగుణంగా సరైన అభివృద్ధి జరక్క రింగురోడ్డు నుంచి రైలుపేట వరకు కొందరు వ్యాపారులు తరలివెళ్లి స్థిరప డ్డారు. పూర్వం ఆర్టీసీ డిపోని పాత పట్టణంలోని రాజు గారి కోటలో ఏర్పాటు చేసినా వివిధ కారణాలతో వేరే ప్రాంతానికి తరలించారు. ఓల్డ్ టౌన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల, పురపాలిక ఉన్నత, రెండు ప్రాథమికోన్నత, నాలుగు ప్రాథమిక పాఠశాలలు, అర్బన్ హెల్త్ సెంటర్ ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ ఏర్పడి ఏడాది దాటినా పాత పట్ట ణంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయాన్నీ ఏర్పాటు చేయ లేదు. ఆర్డీవో, డీఎస్పీ, డీఎల్‌పీవో లాంటి ప్రభుత్వం కార్యాలయం ఏర్పాటు చేస్తే కొంతైనా అభివృద్ధి చెందుతుందని ప్రజాసంఘాల ప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఓల్డ్‌టౌన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్క రించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా చర్యలు

15వ ఆర్థిక సంఘ నిధులు రూ.7కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ తదితర పనులు చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దీంతో పాత పట్టణంలోనూ పలు పనులు జరుగుతాయి. మురుగు నీటి కాల్వల సదుపాయం లేని ప్రాంతాల్లో ప్రణాళికాబ ద్ధంగా నిర్మించేలా దృష్టిసారించాం. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తున్నాం. కాల్వల్లో పూడిక, మొక్కలు తొలగించి సక్రమ పారుదల జరిగేలా చర్యలు తీసుకుంటాం.- **సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్**

కంట్రోల్ రూంల ఏర్పాటు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికలు, భారీ వర్షాల నేపథ్యంలో రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని ఆర్డీవో రామ లక్ష్మి తెలిపారు. మండలాల్లోని లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులను ఆదేశించామ న్నారు. తుపాను, భారీ వర్షాల కారణంగా తక్షణ సహాయం పొందేందుకు కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని తెలి పారు. కంట్రోల్ రూంలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

మండలం	కంట్రోల్ రూం నంబరు
అమృతలూరు	9032288125
భట్టిప్రోలు	8331913995
చెరుకుపల్లి	7207396800
కొల్లూరు	7794894544
నగరం	9676429878
నిజాంపట్నం	7036456786
రేపల్లె	9505322959
చుండూరు	6281216437
వేమూరు	7893929411
ఆర్డీవో కార్యాలయం	08648-293795

ప్రజలను ఆదుకునేందుకు నిరంతర పర్యవేక్షణ

బాపట్ల, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ తీర, లోతట్టు ప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలన్నారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపలవే టకు వెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించేందుకు అధి కార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు బయట, చెట్ల కింద ఉండరాదన్నారు. ఎలాంటి విపత్కర పరి స్థితి తలెత్తినా ప్రజలను ఆదుకోవటానికి నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని శివాలయంలో దీపారాధన చేస్తుండగా పూజారి సతీమణి జయలక్ష్మి (62) చీర కొంగుకు ఈనెల 8న ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై విజయకుమార్ తెలిపారు.

తెదేపా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నేడు

చెరుకుపల్లి (గ్రామీణ): రేపల్లె ఎంఎస్ఎ సమావేశ మందిరంలో తెదేపా నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహి స్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి చెరుకుపల్లి మండలంలో ఉన్న పార్టీ నేతలు, గ్రామ కమి టీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వివిధ హోదాల్లో పార్టీలో పనిచేస్తున్న వారు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు రేపల్లె ఎంఎస్ఎ హాల్ వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు.

తీగ బెడద తొలగింది

అమృతలూరు: మండలంలోని గోవా డలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్క తీగ ఎగబాకింది. వర్షాకాలం కావడంతో విద్యుదాఘాతంతో ప్రమాదం జరుగుతుందే మోనని స్థానికులు భయపడుతున్న తీరుపై ఈనెల 11న 'ఎగబాకిన నిర్లక్ష్యం.. పొంచిన ప్రమాదం' శీర్షి కన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో ఏఈ నాంచారయ్య స్పందించారు. సిబ్బందిని పంపి పిచ్చిమొక్క తీగ తొలగించే చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావ డంతో స్థానికులు ఆనందం వెలిబుచ్చారు.

ఈనాడు స్పందన

పొన్నపల్లిలో దుర్గమ్మ గ్రామోత్సవం

పొన్నపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండ లంలో పొన్నపల్లి దేవస్థ కోటిరెడ్డి ఆశ్రమంలో దేవీ శరన్న వరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. పది రోజుల పాటు ఆశ్రమంలోని మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి ఆల యంలో దుర్గమ్మ విగ్రహాన్ని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆశ్రమ నిర్వాహకుడు శివారెడ్డి ఆధ్వర్యంలో సోమ వారం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసు పునీరు వార పోసి హారతులు అందించారు. భవానీ మాల దారులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విగ్ర హాన్ని విజయవాడ కృష్ణానదిలో నిమజ్జనానికి తరలించారు.

మహిళా హక్కులపై అవగాహన పెంచుకోవాలి

వేమూరు: మహిళలు తమ హక్కులపై అవగా హన పెంచుకుని చట్టాలను సద్విని యోగం చేసుకోవా లని జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ రిసోర్స్ పర్సన్, ప్యానెల్ అడ్వకేట్ యూనిస్ తెలిపారు. జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ, మహిళా కమి షన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహి ళలు చట్టాల గురించి తెలుసుకుని ఉచిత న్యాయ సలహాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది అమీనా రెహ మానియా, ఎస్సై రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాది యూనిస్

మాజీ ఎంపీపీ మృతికి సంతాపం


చిట్టెమ్మ (పాతచిత్రం)

కర్లపాలెం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ, తెదేపా సీనియర్ నేత పమిడి చిట్టెమ్మ(75) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి చిట్టెమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

మాజీ మున్సిపల్ ఛైర్మన్‌కు పరామర్శ

రేపల్లె అర్బన్: రేపల్లె మాజీ మున్సిపల్ ఛైర్మన్ మున గాల వెంకటసుబ్బారావు భార్య మహాలక్ష్మి (73) ఆదివారం రాత్రి మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సోమవారం సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకటసుబ్బారావును పరామర్శించి సానుభూతి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి నివాళి

వేమూరు, న్యూస్‌టుడే: మండలంలోని చావలి, పెరవలి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న గాజుల శ్రీని వాసరావు (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల క్రితం తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. ఆయన మృతికి చావలి సర్పంచి వి. శ్రీనివాసరావు, ఎంపీడీవో శివనారాయణ, పలువురు పంచా యతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

చీరాల అర్బన్: ఈపురుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతున్న కె.భాను(25)ని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘట నపై రైల్వే పోలీసులు మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చీరాల జీఆర్పీ ఎస్సై కొండయ్య తెలిపారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

వేమూరు, చుండూరు, అమృతలూరు, కొల్లూరు, చెరుకుపల్లి, అలకాపురం(పిట్టలవానిపాలెం), భట్టిప్రోలు, పేటేరు(రేపల్లె అర్బన్), ధూళిపూడి(నగరం), నిజాంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకో నేందుకు తగు కార్యాచరణ రూపొందించుకోవాలని తద్వారా ప్రతి పల్లె పండుగ చేసుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుం దని తెదేపా నాయకులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా వేమూరు నియోజకవర్గంలోని యడ్లపల్లి, అమృతలూరు, కుచ్చళ్లపాడు, వెల్లబాడులో రూ. 75లక్షల జాతీయ ఉపాధిహామీ నిధులతో నిర్మించే పలు సీసీ రోడ్ల పను లకు ఎమ్మెల్యే ఆనందబాబు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జె. విజయ బాబు, టి.శివారెడ్డి, డి. సుబ్బారావు, జి.వెంకటను బ్బయ్య, జి.పూర్ణకుమారి, కె.రవీంద్రబాబు, లక్ష్మీబా లు, జనసేన సమన్వయ కర్త ఊసా రాజేష్ తదిత రులు పాల్గొన్నారు. కొల్లూరు మండలంలోని ఈపూరులంక, సుగ్గునలంక గ్రామాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీడీవో నరసిం హారావు శంకుస్థాపన చేశారు. చెరుకుపల్లి మండలంలో మూడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెదేపా నేత అనగాని శివప్రసాద్ భూమిపూజ చేశారు. చెరుకుపల్లిలో రూ. 20లక్షలు, రాంబొట్లపాలెంలో రూ. 15లక్షలు, కుంచలవారిపాలెంలో రూ. 13 లక్షలతో సీసీ రోడ్లకు శ్రీకారం చుట్టారు. నగరం మండల పరి ధిలో ధూళిపూడి, పెద్దవరం గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయ కులు, అధికారులు పాల్గొన్నారు. నిజాంపట్నం మండలం బావా జీపాలెం, ఆముదాలపల్లి గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మా ణానికి భూమి పూజ చేశారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మండల తెదేపా అధ్యక్షుడు మల్లాది రామకృష్ణయ్య, మండల తెదేపా నాయకులు ముఖాముఖం రాధాకృష్ణమూర్తి, దివి రాంబాబు, మాజీ జడ్పీటీసీ పిట్టు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, చెరుకుపల్లి, నిజాంపట్నం తహసీల్దార్లు పద్మావతి, షాకీరాబాషా, ఎంపీడీవోలు షేక్ మహబూబ్ సుబానీ, నాగార్జున, నిజాంపట్నం పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిడి రామకృష్ణ, మహిళా నేత హరనాథ్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలం గొరికపూడిలో పెద్ద నిర్మాణానికి అధికారులు భూమి పూజ నిర్వహించారు. జె.మల్లిక, ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ, ఎంపీడీవో ఎస్.ఏ.రమణ ఈవోపీఆర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండలం అలకాపురం, అల్లూరు గ్రామాల్లో ఎంపీడీవో పోతురాజు సత్యనారాయణ, సర్పంచులు మంతెన గంగరాజు, చెంచులక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రేపల్లె మండలం కాయమూరు, పేటేరు గ్రామాల్లో రూ.10 లక్షలు, రూ. 15 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో శోభారాణి, సర్పంచి గుడి రమాదేవి, తెదేపా నాయకులు గుడి అంకా సుబ్బారావు, వీర్లంక వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చుండూరు: యడ్లపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


నగరం: పెద్దవరంలో రోడ్డు శంకుస్థాపన చేస్తున్న శివప్రసాద్

నేడు పల్లె పండగలో మంత్రి అనగాని

రేపల్లె అర్బన్: రేపల్లె మండలం గుడ్డికాయలంక, బేత పూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించే పల్లె పండగ కార్యక్రమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని తెదేపా నేత శివప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తారన్నారు. మధ్యాహ్నం రేపల్లె గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో తెదేపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావే శంలో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని నా కులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ, వార్డు సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపల్లెలో మూడు అర్జీలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు వచ్చినట్లు సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తెలి పారు. నిజాంపట్నంలో 22ఏ జాబి తాలో నమోదైన తన భూమిని తొలగించేలా చర్యలు తీసుకోవా లని, తనకు చెందాల్సిన భూమిని అక్ర మంగా అనుభవిస్తోందని బొబ్బర్లంక నివాసి, ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసులో తనకు రావాల్సిన పరి హారం ఇప్పించాలని రేపల్లెకు చెందిన వ్యక్తి అర్జీలు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని ఆర్డీ లను సంబంధిత శాఖలకు పంపి నట్లు ప్రసాద్ తెలిపారు.

70 సెంట్లు మాయం చేశారు

నగరం: తన కున్న 1.60ఎక రాల భూమిలో 0.70 ఎకరాల భూమి ఆన్‌లైన్ కనిపించడం లేదని నగరం గ్రామానికి చెందిన ఈవూరి నాగేశ్వరరావు తహసీ ల్దార్ నాంచారయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు.


బాపట్ల: వర్షంతో నిర్మానుష్యంగా వీధి


బాపట్ల: రాజీవ్‌గాంధీ కాలనీలో రహదారిపై నీరు


చెరుకుపల్లి సంపత్‌బాబు కాలనీలో..


సంగుపాలెంలో కాలువను తలపించేలా..


భట్టిప్రోలు ప్రధాన రహదారిపై వర్షపునీరు

తీరాన్ని ముంచెత్తిన వర్షం

పల్లపు ప్రాంతాలు జలమయం


కర్లపాలెం- గణపవరం మధ్య తారకరామానగర్ వద్ద ఇలా..


వర్షపు నీటిలో భవనంవారిపాలెం పాఠశాల భవనాలు

బాపట్ల, కర్లపాలెం, చందోలు(పిట్టలవాని పాలెం), గుళ్లపల్లి, కనగాల (చెరుకుపల్లి (గ్రామీణ), భట్టిప్రోలు, నగరం, వేమూరు, నిజాంపట్నం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడ్రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో జిల్లా కేంద్రం బాపట్లలో లోతట్టు ప్రాంతాల్లో నివ సిస్తున్న పేదలు వణికిపోతున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీ ఎస్టీ కాలనీ, శారదాపురికాలనీ, వెన్నెలకు టినగర్, డ్రైవర్స్ కాలనీ, బావపురికాలనీ, దేవుడి మాన్యం, కొత్తపేట, కుమ్మరిపాలెం, చెంగల్రాయ తోట, ప్యాడిసన్‌పేట, రామకృష్ణాపురం ఎస్టీ కాల నీలో ఇళ్ల చుట్టూ నీరు చేరుతుండటంతో స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నపల్లి డ్రెయిన్ గత వరదలకు పొంగి కట్ట కొట్టుకుపో యింది. ప్రస్తుతం చెరువు నిండుకుండలా మారింది. కలెక్టర్ ఆదేశాలతో జలవనరుల శాఖ గట్టు పటిష్ఠానికి ఏర్పాట్లు చేపట్టారు. ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. భారీ వర్షాలు కొన సాగితే ఇళ్లలోకి నీరు చేరుతుంది. ఇప్పటికే పట్ట ణంలో ప్రధాన రహదారులు జలమయమ య్యాయి. భట్టిప్రోలు మండలంలో పల్లపు ప్రాంతాలు మునిగాయి. ప్రకృతి విపత్తుల నుంచి కాపాడాలని కోరుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నేత జంజనం హేమశంకరరావు తెలిపారు. కర్ల పాలెం మండలం చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచి ఇబ్బం దిగా మారింది. సత్యవతిపేటలో రహదారి కాలువను తలపించింది. కర్లపాలెం- గణపవరం ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో నీరు నిల వడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చెరు కుపల్లి సంపత్‌బాబు కాలనీ ప్రధాన రోడ్డు మండల మీటర్ల మేర నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుళ్లపల్లి, పొన్నపల్లి, నడింపల్లి, కనగాల, తదితర ప్రాంతాల్లోనూ రహ దారులపై నీరు నిలిచింది. పొన్నపల్లి బీసీ కాల నీలో ఇళ్ల చుట్టూ నీరు చేరుతుండడంతో స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నపల్లి మురుగు కాల్వ పూర్తిగా పూడుకుపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చందోలులో తెనాలి డ్రెయిన్ వంతెన వద్ద ప్రధాన


వేమూరులో నడిచేందుకు వీలు లేకుండా..

రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదాలకు నిల యంగా మారింది. మండల కేంద్రం నగరం, ధూళిపూడి, పూడివాడ, ఈదుపల్లి, తాడివారిపాలెం, కారంకిరాయిపాలెం తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరం శివారు మూడో పర్యాయం నాటిన సుమారు 45 ఎకరాల వరి చేలు మళ్లీ ముంపు నకు గురయ్యాయి. నిజాంపట్నం మండలంలో పలు గ్రామాల్లో ప్రధాన, అంతర్గత రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నిజాంపట్నం హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన బోట్లు వెను తిరిగాయి. పిట్టలవానిపాలెం మండలం భవ నంవారిపాలెం పాఠశాల గదులు, ఆవరణ మేర నీట్ల నిలబడ్డాయి. సంగుపాలెం, ఇస్లాంపేట, బాజీపాలెం, జి.ఎన్.పాలెం, చందోలులలో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. వేమూరులో పలు కాలనీల్లో వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు.


చందోలు వద్ద కోతకు గురై గుంతగా మారిన ప్రధాన రహదారి


నిజాంపట్నం: అచ్యుతాపురం వద్ద రేపల్లె- నిజాంపట్నం ప్రధాన రహదారి


కర్లపాలెం: చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో..

పమిడిపాడుకు మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం పమిడిపాడులో మంగళవారం నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని తెదేపా మండల అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

నేడు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు మండల సర్వసభ్య సమావేశం 15న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నేతాజీ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

రైతుసేవా కేంద్రాల్లో పంట ముసాయిదా జాబితా

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ఈ-పంట నమోదు ముసాయిదా జాబితాను ఆయా రైతుసేవా కేంద్రాల వద్ద ప్రదర్శనలో ఉంచినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం జె.పంగులూరు రైతుసేవా కేంద్రం వద్ద ఉంచిన ముసాయిదా వివరాలు ఆయన పరిశీలించారు. అభ్యంతరాలు ఉంటే వెంటనే రైతుసేవా కేంద్రం సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం ఈనెల 18వ తేదీన తుది జాబితా ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

అద్దంకి, సంతమాగులూరు, న్యూస్‌టుడే: యువత అన్ని రంగాల్లో రాణించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బల్లికురవ మండలం వి. కొప్పెరపాడుకు చెందిన డి.ఏడుకొండలు కథ, నిర్మాణం.. వి. వెంకట్ దర్శకత్వంలో రూపొందించిన 'వేగం' షార్ట్ ఫిల్మ్ సినిమా సీడీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆలోచనలతో సందేశాత్మక చిత్రాలు, షార్ట్ ఫిల్మ్ రంగంలో యువకులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. షార్ట్ ఫిల్మ్ నటీనటులను, యూనిట్ సభ్యులను అభినందనలు తెలిపారు.


'వేగం' షార్ట్ ఫిల్మ్ సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి

పైర్లు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలి

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని రైతులు సాగు చేస్తున్న పైర్ల సస్యరక్షణకు జాగ్రత్తలు పాటించాలని ఏవో సుధీర్‌బాబు కోరారు. అల్పపీడనం కారణంగా కురిసే వానలకు మాగాణి పైరు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని, నారుమళ్లు వేసిన రైతులు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మహిళా హక్కులపై అవగాహన పెంచుకోవాలి

వేమూరు: మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ రిసోర్స్ పర్సన్, ప్యానల్ అడ్వకేట్ ఝాన్సీ తెలిపారు. జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై వేమూరులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాల గురించి తెలుసుకుని ఉచిత న్యాయ సలహాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది అమీనా రెహమానియా, ఎస్సై రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాది ఝాన్సీ

నిర్వహణపై నిట్టూర్పు

అధ్వానంగా రైల్వే పైవంతెన 50 చోట్ల పెరిగిన మొక్కలు

న్యూస్‌టుడే – చీరాల గ్రామీణం

ప్రజల అవసరాల నిమిత్తం చీరాల నుంచి కారంచేడు, పర్చూరు, చిలకలూరిపేట, గుంటూరు (వయా పర్చూరు) వైపు వెళ్లడానికి 20 ఏళ్ల క్రితం నిర్మించిన రైల్వే పై వంతెన (ఆర్‌వోబీ) నిర్వహణ నోచుకోవడం లేదు. ఇరు వైపులా పిల్లర్లు, శ్లాబు మధ్య భాగంలో దాదాపు 50 చోట్ల మర్రి మొక్కలు పెరుగుతూ. .దెబ్బగా రూపాంతరం చెందుతున్నా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు చీమ కుట్టినట్లు ఉండటం లేదు. రూ.8 కోట్లతో ఆర్‌ఓబీని నిర్మించినా..నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదు.


వంతెన మొదట్లో నీటితో పెద్ద గుంత

ఇదీ దుస్థితి

❖ ఇరు వైపులా దాదాపు ప్రతి పిల్లర్ వద్ద 50 చోట్ల మర్రి ఊడలు లోపలకు దిగి ఆర్‌వోబీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మొగ్గ దశలోనే తొలగించకపోవడంతో నాణ్యత దెబ్బతింటూ అడుగు భాగంలో శ్లాబు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయట పడుతున్నాయి.

❖ పైగా వంతెనపై భాగంలో రహదారిపై గోతులు ఏర్పడి చోదకులకు ప్రమాదంగా మారాయి.

రాకపోకలకు కీలకం

చీరాల - నరసరావుపేట రహదారిలో ప్రయాణం చేయాలంటే గతంలో చాలా సమయం పట్టేది. కారంచేడు గేటు ద్వారా వెళ్లాల్సి ఉండటంతో బస్సులు ఇతర వాహనాలు నిలిచిపోయేవి. దీంతో పట్టణంలో రద్దీ ఏర్పడేది. ఈ సమస్య తీర్చేందుకు 1994లో ఆర్‌వోబీకి శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణం పూర్తి కావడానికి పదేళ్లు పట్టింది. ఎట్టకేలకు 2004లో ప్రారంభించిన అనంతరం ప్రయాణం సులభం అయింది. ఆర్వోబీ మీదుగా అంచనా మేరకు సుమారు 20 నుంచి 25 వేల మధ్య నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. చీరాల నుంచి రైల్వే కట్ట అవతల ఉన్న ఇజ్రాయిల్‌పేట, హరిప్రసాద్‌నగర్, విఠల్‌నగర్, దండుబాట ప్రాంతం, జయంతిపేట, మరియమ్మ పేట, ఐక్య నగర్, విజయనగర్ కాలనీ, సర్వ వెళ్లడానికి సైతం ఈ వంతెన ఉపయోగపడుతోంది.


వంతెనపై పెరుగుతున్న మొక్కలు

ఆర్‌వోబీని పరిశీలించి చర్యలు తీసుకుంటాం

చీరాల ఆర్‌వోబీని వెంటనే పరిశీలించి ఒక నివేదిక రూపొందిస్తాం. ఈ మేరకు తగిన చర్యలు తీసుకుని కీలకమైన ఈ వంతెన భద్రతకు ముప్పు వాటిల్లకుండా ప్రయత్నిస్తాం.

– నళినీ, డీఈఈ, ఆర్‌అండ్‌బీ చీరాల

విద్యుత్తు అక్రమ వినియోగంపై అధికారుల కొరడా

శింగరకొండపాలెం (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండపాలెం సమీపంలోని చేపల చెరువుల వినియోగానికి అక్రమ విద్యుత్తు వినియోగంపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఈనాడు దినపత్రికలో ఈ ఏడాది ఆగస్టు 29న ప్రచురితమైన 'చీకటి మాటున తోడేస్తున్నారు' కథనానికి స్పందించారు. సోమవారం శింగరకొండపాలెం పరిసరాల్లో విద్యుత్తు వినియోగిస్తున్న చేపల చెరువుల నిర్వాహకుల వివరాలు సేకరించారు. అనుమతి లేకుండా విద్యుత్తు వినియోగిస్తున్న ఏడుగురు నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని, వారి నుంచి రూ.1.75 లక్షల అపరాధ రుసుము విధించినట్లు విద్యుత్తు గ్రామీణ ఏఈ ఆర్‌వీఎస్.శివప్రసాద్ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణకు చర్యలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో చీరాలలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారి రక్షణకు తగిన చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ కె.గోపీ కృష్ణ తెలిపారు. వాయుగుండం ప్రస్తుతం నెల్లూరు వద్ద ఉందని, మంగళవారం నాటికి చెన్నై - నెల్లూరు మధ్య తీరం దాటవచ్చనే సమాచారం ఉన్న నేపథ్యంలో చీరాల ప్రాంతంలో అప్రమత్తంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రోశయ్యకాలనీ, కొత్తపాలెం తదితర ప్రాంతాల వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వాడరేవులో మత్స్యకారులు సముద్రంలో లోపలకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. మత్స్యకారుల కోసం జిల్లా ఉన్నత పాఠశాల భవనాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. చీరాల రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 24 గంటలు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచినట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా నిత్యావసర సరుకులు అందించడానికి పౌర సరఫరా అధికారులు ఈ పాటికే ప్రణాళికతో ఉన్నట్లు ఆయన వివరించారు.

స్ట్రెచర్ బహూకరణ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఈపురుపాలేనికి చెందిన మునగాల మైమిత, నారాయణ దంపతులు చీరాల ఏరియా వైద్యశాలకు స్టీలు స్ట్రెచర్ బహూకరించారు. సోమవారం సూపరింటెండెంట్ డాక్టరు సుభాషిణికి దీనిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సూపరింటెండెంట్ దాతలను అభినందించారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం.. పల్లె పండగతో సాధ్యం

అద్దంకి, జె.పంగులూరు, తిమ్మనపాలెం (మేదరమెట్ల), పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి, పూసపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనల మేరకు చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలు వర్షం కురుస్తున్నప్పటికీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ రహదారులు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.


గోవాడ శంకుస్థాపనలో ఎంపీడీవో సింగయ్య


చందలూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి


విజనంపాడులో రహదారి నిర్మాణ భూమిపూజలో..


పూసపాడులో..


తిమ్మనపాలెంలో భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

కుంగిన అంచుతో ప్రమాదకర ప్రయాణం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం కారణంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంకొల్లు- గంగవరం మధ్య ముప్పవరం ఆర్‌అండ్‌బీ రహదారి పలుచోట్ల కుంగిపోయి, రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఐదేళ్ల క్రితం దగ్గుబాటి విద్యాసంస్థల సమీపంలో చప్టా రక్షణ గోడ కూలిపోగా నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. దెబ్బతిన్న ప్రాంతంలో ఇసుక బస్తాలు వేసి మమ అనిపిస్తున్నారు. విద్యాసంస్థలకు-గంగవరం గ్రామం మధ్య మలుపులో రెండేళ్ల క్రితం రహదారి అంచు కుంగిపోగా తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ప్రస్తుత వర్షాలకు తిరిగి అదే చోట అంచులు కుంగాయి. మరో రెండు చోట్ల కుంగిపోవటంతో వాహన చోదకులు భయపడుతున్నారు. ఇంకొల్లు నుంచి గంగవరం వరకు రహదారి గుంతలుపడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రహదారికి కనీస మరమ్మతులు చేపట్టాలని సర్పంచి సుధాకర్ విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, ఇంకొల్లు**


ఐదేళ్ల క్రితం కూలిన రక్షణ గోడ


గంగవరం సమీపంలో ఇలా..

గ్రానైట్ లారీల ప్రభావం.. రహదారులు ఛిద్రం

రాత్రింబవళ్లు, సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్న గ్రానైట్ లారీల కారణంగా గ్రామీణ రహదారులు ఛిద్రమవుతున్నాయి. దీనికి ఉదాహరణ బల్లికురవ మండలం కొణిదెన నుంచి మార్టూరు మండలం రాజుపాలెం వద్ద జాతీయ రహదారిని కలిపే రహదారి. బల్లికురవ మండలం ఈర్లకొండ నుంచి తొలిచిన గ్రానైట్‌ను వేసుకుని లారీలు మితిమీరిన బరువుతో మార్టూరు మండలం రాజుపాలెం వద్ద జాతీయ రహదారి పైకి వెళుతున్నాయి. దీంతో తారురోడ్లు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఈనేపథ్యంలో నిరంతరం వాహనచోదకులు, పాదచారులు నడవడం కష్టంగా మారింది. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈ బాబ్జీని వివరణ కోరగా కొణిదెన నుంచి రాజుపాలెం వరకు ఆరు కి.మీ. మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కొణిదెన నుంచి బల్లికురవ వరకు మరో ఐదు కిలోమీటర్ల మరమ్మతులకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. **-న్యూస్‌టుడే, బల్లికురవ (అద్దంకి)**


కొణిదెన-రాజుపాలెం మధ్య దెబ్బతిన్న రహదారి

వీటిని ఇలాగే వదిలేస్తారా?

వృక్షో రక్షతి.. రక్షితః అన్న సూక్తి గోడలకే పరిమితం అవుతోంది. మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. చీరాల మంచి నీటి చెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులు నిధులు కేటాయించారు. అటవీ శాఖ సహకారంతో పలు రకాల మొక్కలు నాటి సంరక్షించాలని సంకల్పించారు. కాని వాటిని నాటకుండా అలాగే పెట్టడంతో ప్లాస్టిక్ సంచుల్లోనే అవి పెరిగి పెద్దవుతున్నాయి. అధికారులు ఇకనైనా మొక్కలు నాటాలని పలువురు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం**



బాగు చేయండి.. వెతలు తీర్చండి

నిత్యం వందలాది మంది సందర్శించే చీరాల ఏరియా వైద్యశాలలో అంతర్గత రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆసుపత్రి ముఖ ద్వారం నుంచి కొత్తగా నిర్మించిన భవనాల వద్దకు వెళ్లడానికి మధ్యలో కొంత మేరకు అంతర్గత రోడ్డు ఉంది. గతంలో ఇది పూర్తిగా గుంతలమయంగా ఉండగా.. రెండేళ్ల క్రితం గ్రావెల్‌తో సరిచేశారు. ఇటీవల కాలంలో మళ్లీ గోతులు ఏర్పడి వర్షం పడిన ప్రతిసారి అందులో నీరు చేరి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రూ.కోట్లాది వ్యయంతో కొత్త భవనాలు నిర్మించిన అధికారులు అంతర్గత రోడ్డుపై ఉదాశీన వైఖరి ప్రదర్శించడం విశేషం. ఇకనైనా సీసీ రహదారిగా అభివృద్ధి చేసి వెతలు తీర్చాలని రోగులు, వీరి బంధువుల కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం**


గోతులు..అందులో వర్షం నీటితో ఇబ్బంది పెడుతున్న రహదారి


కొత్తపేటలో వర్షానికి తడిసిన ఓదెలు పరిశీలిస్తున్న ఏవో కాశీవిశ్వనాథం


నాగన్నవాగు వద్ద పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు


కడవకుదురులో మునిగిన వరి నారుమడులు

వర్షం తెచ్చిన కష్టం

అల్పపీడనంతో అన్నదాతలు ఆందోళన

చీరాల అర్బన్, వేటపాలెం, చినగంజాం, అద్దంకి, జె. పంగులూరు, దుద్దుకూరు (ఇంకొల్లు), మేదరమెట్ల, పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి,న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నాలుగు రోజుల పాటు ఈ ప్రభావం ఉంటోందని వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించింది. దీంతో అన్నదాతలు సాగు చేసిన పంటలపై ప్రభావం పండుతతోదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాలను పరిశీలించారు.


శింగరకొండ వద్ద కురుస్తున్న వర్షం


దుద్దుకూరు చిన్నవాగులో చేరిన నీరు


ద్రోణాదుల -నాగండ్ల మధ్య చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

మిరప సాగుపై ఏదీ ఆసక్తి ?

✦ సవాళ్లు ఎదుర్కొనేందుకు సాహసించని రైతన్న

✦ షేడ్‌నెట్‌ల్లో పెంచిన మొక్కల తొలగింపు

అద్దంకి, మార్టూరు, న్యూస్‌టుడే : వాణిజ్య పంటగా పేరొందిన మిరపసాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. ఫలితంగా షేడ్‌నెట్‌ల్లో పెంచిన మొక్కలను నాటలేక వదిలేస్తున్నారు. 90 రోజులు పెంచిన వాటిని రైతులు తీసుకెళ్లేందుకు ఇష్టపడని నేపథ్యంలో షేడ్‌నెట్‌ల యజమానులు వాటిని పీకి రోడ్డు పక్కన పడేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మిర్చి పంట అధికంగా సాగు చేసేవారు. ప్రత్యేకించి ఆరోగ్యమైన వాతావరణంలో మొక్కలు పెంచేందుకు షేడ్‌నెట్‌లు, పాలీహౌస్‌లు ఉపయోగించేవారు. వాతావరణ సమ శీతోష్ణస్థితిలో పెరిగిన మొక్కల నుంచి అధిక దిగుబడులు వస్తాయనే ఉద్దేశంతో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని చిన్నకొత్తపల్లి, శింగరకొండపాలెం, సంతమాగులూరు, కొమ్మాలపాడు, కొరిశపాడు, మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లుల్లో మిరపనారు భారీగా సాగు చేసే వారు.


చిన్నకొత్తపల్లి షేడ్ నెట్‌లో పెంచిన మిరపనారు తొలగిస్తున్న కూలీలు

పెరిగిన ఖర్చులు.. తగ్గిన సాగు విస్తీర్ణం

రెండేళ్ల క్రితం వరకు ఎకరా పొలంలో మిరప సాగు చేయాలంటే గరిష్ఠంగా రూ.లక్ష వరకు పెట్టుబడి అయ్యేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ఎకరాలో మిరప సాగు చేయాలంటే కనిష్ఠంగా రూ.రెండు లక్షల వరకు ఖర్చు తేలుతోంది. 50 శాతం కూలీల ఖర్చు అవుతుండగా మిగిలినవి ఇతర ఖర్చులవుతున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో సాధారణ విస్తీర్ణం 10 వేల హెక్టార్లు ఉండగా అతికష్టం మీద ఏడు వేల హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో సవాళ్లను ఎదుర్కొని పంటలు సాగు చేసినప్పటికీ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవటం కూడా మిరపసాగును ప్రభావితం చేస్తుంది. ఈ కారణంగా షేడ్ నెట్‌ల్లో పెంచిన మిరప మొక్కలను పీకేస్తున్నారు.

లక్ష మొక్కల నేలపాలు

అద్దంకి మండలం చిన్నకొత్తపల్లికి చెందిన రైతు డి.లక్ష్మీనారాయణ రెండు ఎకరాల విస్తీర్ణంలోని షేడ్‌నెట్‌లో మిరపనారు పెంచారు. మూడు నెలల క్రితం రైతుల సూచన మేరకు పెంపకం చేపట్టారు. మిరప సాగు పట్ల రైతుల్లో ఆసక్తి తగ్గిపోవటంతో ఆయన వెనుకడుగు వేశారు. ఇక లాభం లేదనుకుని షేడ్‌నెట్‌లోని లక్ష మొక్కలను ఇటీవల తొలగించారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు 9 వేల మొక్కలు నాటుతారు. అంటే సుమారు 11 ఎకరాలకు సరిపడా మిరపనారు నేలపాలైంది.


పీకిన నారు పారబోస్తున్న మహిళ

గిట్టుబాటు ధర లేకపోవడమే కారణం

మిరప సాగు చేయాలంటే రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ విస్తీర్ణం కంటే సాగు విస్తీర్ణం తగ్గింది. ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధర లేని కారణంగా సాగు చేయడం లేదు. పైగా పెరిగిన కూలీ ఖర్చులు రైతులను కలవర పెట్టిస్తున్నాయి.

-కె.వెంకటకృష్ణ, ఏవో, అద్దంకి

నిందితులను అరెస్టు చేయాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వేటపాలెం మండలంలో వినాయకపురంలో ఇటీవల ఎస్టీ వర్గానికి చెందిన గంటా రాజశేఖర్ ఆత్మహత్య చేసుకోవాడానికి ప్రధాన కారకురాలైన లక్ష్మీ సుకన్యను వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఆమె పేరు నమోదు చేసినా నేటికీ అరెస్టు చేయకపోవడంపై ఆయన ఇటీవల బాధిత కుటుంబంతో ఎస్పీని కలిసి విన్నవించారు. దీనిపై విచారణాధికారిగా చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్‌ను నియమించడంతో సోమవారం కొత్తపేటలోని ఆయన కార్యాలయంలో మృతుడి కుటుంబంతో కలిసి న్యాయం చేయాలని కోరారు.

రామన్నపేటలో వైద్యశిబిరం

వేటపాలెం, న్యూస్‌టుడే: రామన్నపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఒంగోలుకు చెందిన కిమ్స్ ఆసుపత్రి, కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 60 మంది రోగులకు శస్త్రచికిత్సలు అవసరం కావడంతో వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయడం జరుగుతోందని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు.

విద్యార్థిని కుటుంబానికి సాయం

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి భవిత కేంద్రంలో పదోతరగతికి సిద్ధపడుతున్న దివ్యాంగ విద్యార్థిని కోవూరి దుర్గ కుటుంబానికి ఫిజియో థెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని సాయం అందించారు. ఇటీవల అకాల మరణం చెందాడు. నలుగురు ఆడపిల్లలతో ఇబ్బంది పడుతున్న ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తనవంతు సాయంగా ఫిజియో థెరపిస్టు కొంతమేర నగదు, బియ్యం, కూరగాయలు, పండ్లు సోమవారం అందించారు.

విశ్రాంత ఎంఈవో మృతికి నివాళి

రామ్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే : విశ్రాంత ఎంఈవో వై. సత్యనారాయణ(70) సోమవారం కన్నుమూశారు. ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈవోగా అద్దంకి, తాళ్లూరు, బల్లికురవలో పని చేశారు. రామ్‌నగర్ వద్ద నివాసంలో ముంటున్న ఆయన మృతదేహానికి పలువురు ఉపాధ్యాయులు నివాళి అర్పించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఈపురుపాలెం రైల్వేస్టేషను సమీపంలో పట్టాలు దాటుతున్న కె.భాను(25)ని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై రైల్వే పోలీసులు మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చీరాల జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు.